# అన్వేషితులు

పౌర్ణమినాటి రాత్రి.

కారుమబ్బువేసి అంతా చీకటిగా ఉంది.

జాన్ చుట్టతీసి ముట్టించాడు.

గోవిందు రిక్షా తొక్కుతున్నాడు.

'ఐ... ఇంగ్లీషు... స్పీక్...' అన్నాడు గోవిందు.

జాన్ నవ్వాడు— 'నాకు తెలుగు వచ్చు...' అన్నాడు.

చుట్టపొగ ఉంగరంలాగా బయలుదేరి గాలిలో కలిసి పోయింది.

'మద్రాసులో చాలాకాలం ఉన్నాను అక్కడ తెలుగు నేర్చుకున్నా...' అన్నాడు జాన్.

గోవిందు మెదలకుండా పెడలు తొక్కుతున్నాడు. ఒక క్షణం ఆగి 'మనదీ... ఏ దేశంసార్ ? అని అడిగాడు.

'ఇంగ్లీషువాణ్ణి నేను '

'ఏం పని మీద వచ్చారు సార్ ..'

'మొన్న సింగపూర్‌నుంచి షిప్పు వచ్చింది... అందులో వచ్చాను.. ఇంకోవారంరోజులుంటానులే ఇక్కడ...'

'రిక్షా ఎటుపోనిమ్మంటారు సార్ ..'

'ఊరు నా కేం తెలుసు .. నువ్వే చూపించాలి.'

జాన్ నవ్వుతుంటే దగ్గుతున్నట్లుంది. 'షిప్పులో కూర్చుంటే తోచలేదు... అందుకని ఇట్లా బయలుదేరాను' జాన్ చుట్టను పంటికింద పెట్టి మాట్లాడుతున్నాడు.

'నీ పేరేమిటి...'

'గోవిందు ..'

'నా పేరు జాన్ ..'

'సార్ ...'

జాన్ మళ్లీ నవ్వాడు. నవ్వుతోపాటు దగ్గుదొంతర్లుగా వచ్చింది. చాలా బలహీనంగా ఉన్నట్లు కనిపించాడు. ముఖంమీద సన్నగా ముడతలు పడ్డాయి.

గోవిందు తొక్కకుండానే రిక్షా వాలులో పోతోంది. మధ్యమధ్య ఉరుములు, మెరుపులు వస్తున్నాయి.

వాన వచ్చేటట్లు ఉంది.

ఉండి ఉండి ఒక్కసారిగా నేను చాల చెడ్డవాణ్ని గోవిందూ...' అన్నాడు జాన్.

'అదేమిటి సార్ '

'నీకేం తెలుసు నా సంగతి .. ప్చ్ ..'

'తమాషాగా మాట్లాడతారు సార్ మీరు...' జాన్ చుట్ట కింద పారేసి ఉమ్మేశాడు.

'ఒళ్ళంతా ఇదిగా ఉంది... గోవిందూ కొంచెం లోపలకు ఏం దొరకదూ '

గోవిందు వెనక్కు తిరిగి నవ్వాడు.

'ఎందుకు దొరకదు సార్ దొరికే చోటుకు తీసుకుని పోతానుగా...'

'ఊ... పోనీ అట్లాగయితే ..'

గోవిందు మెల్లిగా రిక్షా ఒక సందులోకి తీసుకెళ్ళి అక్కడినుంచి నాలుగైదు మలుపులు తిప్పి ఒక పూరిగుడిసె ముందు ఆపాడు. చూరు నేలకు తగిలేటట్లుగా ఉంది. రోడ్డుకంటె ఇల్లు పల్లంగా ఉంది. వంగి ఇంట్లోకి వెళ్ళారు ఇద్దరూ.

'ఏం కావాలి...'

'సార్ . వచ్చారు ..' అన్నాడు గోవిందు. వచ్చినతను గోవిందు వంక చూశాడు.

'నీ కేం భయంలేదులే.. నే ఉన్నాగా ..' అన్నాడు గోవిందు.

సారాబుడ్లు వచ్చినాయి.

తీగెకు తగిలించిన లాంతరు తెచ్చి పక్కనే ముక్కాలు పీటమీద పెట్టాడు.

'నువ్వుగూడా తీసుకో...' అన్నాడు జాన్.

'అబ్బే వద్దుసార్ ...'

'అదేమిటి' అన్నాడు జాన్ ' హుఁ . మీ వాళ్ళంతా అంతే మమ్మల్ని తాగిస్తారు... మీరు తాగరు. మేం పాడయిపోవాలని మీ ఉద్దేశం... సరే కానియ్యండి ఏం చేస్తాం .' జాన్ గబగబా సీసా కాళీ చేశాడు.

'మాది ఇంగ్లండు .. తెల్లవాడంటే గొప్పవాడని మీ ఉద్దేశం... అంతేనా...' జాన్ నవ్వితే రెండు బంగారు పళ్లుకూడా కనిపించాయి. కొంచెం తూలుబాటు వస్తోంది. మళ్ళా చుట్ట ముట్టించాడు.

'ఇక్కడినుంచి ఎటు తీసుకుని పోతున్నావు ' గోవిందును దుకాణం మనిషి అడిగాడు.

'ఇంకా ఏమీ అనుకోలేదు ..' అన్నాడు గోవిందు.

'అన్నట్టు... నిన్ను అడగలేదుకదూ . రాధ అని .. ఆ... రాధాదేవి ! అని ఉంది తెలుసా మీకు...'

'ఏ రాధాదేవి సార్ .'

జాన్ జేబులు తడుముకున్నాడు. 'ఫొటో మరిచిపోయాను... షిప్పులోనే ఉన్నట్లుంది. ఆమె సన్నగా పొడుగ్గా... నల్లగా ఉంటుంది. నల్లగా ఉంటే మటుకు ఏం ?... ఎంతెంత కళ్ళని ? తెల్లటి తెలుపు... పెద్ద... పెద్ద కళ్ళు... ఇంతంత... ఉంటాయి...' జాన్ చేతుల్తో చూపిస్తున్నాడు 'మద్రాసునుంచి వచ్చింది... పేరు చెప్పా గదూ... రాధ...రాధాదేవి... ఆ... అంతే... కరెక్టు..."

గోవిందు, సారా దుకాణం మనిషి ఒకళ్ళముఖం ఒకళ్ళు చూసుకున్నారు.

'పేటకుపోయి కనుక్కుందాం సార్...' అన్నాడు గోవిందు.

'ఇంకెక్కడికి వద్దు తెలిసిందా ? ఇప్పుడే చెపుతున్నా...' జాన్ కళ్ళు ఎర్రబడ్డాయి. లేవబోతూ తూలి పడ్డాడు.

సారా దుకాణం మనిషి గోవిందుని పిలిచి ఏదో రహస్యంగా

చెప్పాడు. జాన్ పదిరూపాయల కాగితం తీసి చాపమీద పడేశాడు... తను లేవబోయి మళ్ళీ పడ్డాడు.

'కొంచెం చెయ్యి అందుకో గోవిందూ...' జాన్ చెయ్యి చాచాడు. గోవిందు చెయ్యి పట్టుకుని అతన్ని పైకి లేవతీశాడు. జాన్ చెయ్యి తగలగానే గోవిందుకు షాక్ తిన్నట్లయింది. అతని ఒళ్ళు పేలిపో తోంది.

'మీకు ఒంట్లో బాగాలేదా సార్...'

'బాగానే ఉంది... రాధ కనబడితే పూర్తిగా బాగయిపోయేది... కొంచెం ఈ పిస్టలు పట్టుకో!' జాన్ పిస్టల్‌ను గోవిందుకిచ్చి జారిపో తున్న లాగూను పైకి లాక్కున్నాడు.

రిక్షా బయలుదేరింది.

గోవిందు కొంతదూరం పోయిన తర్వాత రెండు మూడు కిళ్లీకొట్ల దగ్గర ఆగి 'రాధాదేవి' గురించి విచారించాడు. వివరం తెలియలేదు. ఒక ఇల్లు చూపించారుగాని జాన్ అనుకున్న రాధాదేవి కాదు. ఇంకెవరో ఉన్నారు.

'రేపొద్దున పోదురుగాని...' అంది ఆమె.

గోవిందు విసవిసా కిందకు దిగివచ్చాడు.

'సరే. ఏం చేస్తాం... మళ్లీ వెనక్కు తీసుకునిపో...' అన్నాడు జాన్.

టైము చాలా అయిపోయింది.

'మీకు జ్వరం ఉన్నట్లుందిసార్,..'

'అవును గోవిందూ... ఒకచిన్న ఉపకారం చేస్తావూ?... డబ్బిస్తాసుగాని...'

'డబ్బుకేమొచ్చె...అసలు చెప్పండిసార్...'

'ఈ రాత్రి షిప్ లోకిపోవటానికి కుదరదు... మామూలుగా అయితే ఎక్కడో అక్కడ రాత్రి గడిపివేసేవాణ్ణి...నాకు ప్రాణం ఏమీ బాగాలేదు...ఎక్కడన్నా పడుకోవటానికి కొంచెం చోటు దొరికితే...' గోవిందు తికమక పడ్డాడు.

జాన్ ఒక క్షణం ఆగి 'మీ ఇంటికి తీసుకొని పోరాదూ...' అన్నాడు. 'నీకేం భయం అక్కర్లా... ఈ పిస్టలు నీ దగ్గర ఉంచుకో... నేనేమన్నా పిచ్చిపని చేస్తే దాంతో కాల్చేద్దువుగాని సరేనా?'

జాన్ గొంతు తడబడుతోంది. మనిషి వణుకుతున్నాడు. 'ఇంకా ఏమిటి అనుమానం?' ఏమి చెయ్యటానికీ పాలు పోలేదు గోవిందుకి. జాన్ జ్వర తీవ్రంలో ఉన్నాడు. ఆతనికి సహాయం చేస్తే తప్పేమీ లేదు. తనుతీసుకు వెళ్లి తనింట్లో రాత్రి పడుకోనిస్తే! గూడెం వాళ్లంతా ఏమనుకుంటారు? తెల్లవాడు!! తెల్లవాళ్ల గురించి ఆగూడెంలో అభిప్రాయ భేదం లేదు. అందరిదీ ఒకే మాట.

కాని తనకు వాళ్లతో ఉన్న సంబంధంవేరు. ఓడల్లో ఎంత మందో దిగివస్తూంటారు. వాళ్లకు కావాల్సిన ఏర్పాట్లన్నీ తను స్వయంగా చేస్తాడు. కానీ తను కనీసం సారాయి రుచి గూడా చూసి ఎరుగడు. తనది వ్యాపారం. అంతకంటే అందులో తన బాధ్యత ఏమీ లేదు. కాని

జాన్ పరిస్థితి వేరుగా ఉంది ఇప్పుడు పోయి ఏ అరుగు మీదన్నా పడుకుంటే అతని పని ఏ మవుతుందో ఏమో!

జాన్ బాగా దగ్గుతున్నాడు. గోవిందు ఒక నిర్ణయానికి వచ్చాడు.

'అట్లాగే మాఇంటికి పోదాం రండి సార్...' అన్నాడు.

జాన్‌కు ప్రాణం లేచి వచ్చింది 'పద...పద'...అన్నాడు.

గోవిందు రిక్షా వేగంగా తొక్కాడు. రొప్పుతూ, రోస్తూ ఇంటి ముందుకు తీసుకెళ్లి బ్రేకులు వేశాడు. చెయ్యి పట్టుకొని జాన్‌ను మెల్లిగా దించాడు. దర్వాజాదగ్గిర మెల్లిగా వంగి మోపంతా గోవిందుమీద చూపి మెల్లిగా అడుగులు వేశాడు. వెళుతూనే చాపమీద కూలబడ్డాడు. గోడకానుకుని ఒకకాలు కొంచెం ముడుచుకుని మోకాలు మీద చెయ్యి వేసుకున్నాడు.

'గోవిందూ...'

'ఏమిటి సార్...

'నువ్విక్కడికి తేబోతే నా పని ఏమయ్యేది...' అన్నాడు.

ఒక్క క్షణం ఆగి నిస్పృహంగా చూశాడు.

'అమ్మా, నాన్నా యుద్ధంలో చనిపోయారు. ఒక్కణ్ణి ఓడలో చేరాను...రాధ కనపడలేదు...ఇంకో రిక్షావాడయితే వీధిలోదించేసి వచ్చేవాడు... చచ్చేవాణ్ణి...ఆ...ఇదిగో...తుపాకి నీ దగ్గరే ఉంచు .. ఒంట్లో బాగాలేదు కాబట్టి, ఇలా మర్యాదగా మాట్లాడు తున్నానని, చాలా

చెడ్డవాణ్ణి...' మాట్లాడుతూ ఆయాసపడుతున్నాడు. గోడకు చేర గిల బడి గట్టిగా నిట్టూర్చాడు.

ఏవో దీపం పురుగులు ఇల్లంతా ఎగురుతున్నాయి. బల్లులు గోడమీద స్వైర విహారం చేస్తున్నాయి.

'మళ్లీ మరచి పోతానేమో...ఈ పది రూపాయలు దగ్గరుంచు...' అన్నాడు జాన్.

'అంతెందు కండి...'

'నా ప్రాణానికి అంత మాత్రం విలువన్నా ఇయ్యిలే...నేను షిప్పును నడపగలను తెలుసా...!

'మీరు పడుకోండి.'

'రెస్టుకే మొచ్చిగానికథంతావిను...'

'రపొద్దున చెబుదురుగానిసార్...'

'అప్పుడు మళ్లీ చెబుతానులే...రాధాదేవి ఎవరో చెప్ప లేదుగా నీకు... ఈపాటికి చచ్చిపోయి ఉంటుందిలే... ఎవరో, ఈ ఊరొచ్చింది అంటే ఏమోలే అనుకున్నా...' గోవిందు మెదలకుండా బయటకు వచ్చేశాడు.

సత్తెయ్య ఎదురయ్యాడు.

'తెల్లోడు ఎవరో వచ్చాడంటగా మీ ఇంటికి...'

'అవును...' అన్నాడు గోవిందు ముభావంగా...

'ఇదంతా సానిగూడెం చేద్దామనుకుంటున్నావా...ఎట్లా?' సత్తెయ్య మెల్లిగానే అడిగినా ఆ మాట నిప్పులాగా తాకింది గోవిందుకి.

'సత్తెయ్యా?' అంటూ బిగ్గరగా అరిచాడు.

'బర్రె గొడ్డు లాగా అట్లా అరుస్తా వెందుకురా? నీ రిక్షా వ్యాపారం...ఎవరికి తెలియదనుకున్నా వేమిటి...ఏదో, ఎందుకులే అని ఊరుకుంటుంటే...సరాసరి గూడెంలోకి తెచ్చావు...!! ఆయ్...' సత్తెయ్య చెయ్యెత్తాడు.

గోవిందు చికాకు పడ్డాడు. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో చిక్కుకుంటాడని పడ్డ అనుమానం నిజమయింది.

'అది గాదు సత్తెయ్యా...జ్వరంగా ఉంటే ఇట్లా తెచ్చాను... రేపొద్దున్నే పంపేస్తాను...'

జ్వరంగా ఉంటే ఇక్కడెందుకురా... ఏ చెట్టు కిందన్నా దించెయ్యక...'

'జ్వరం బాగా ఉంది సత్తెయ్యా...'

'ఎక్కువయితే చస్తాడు...అంతేనా...ఆళ్లంతా చస్తేమటుకు ఏంరా...'

గోవిందు మనస్సు చివుక్కుమంది.

'వాళ్లనని ఏం ఉపయోగంరా...కొంపకు కొరివి పెట్టేవాడివి నువ్వుండగా...పుల్లయ్య కూతురు సంగతి మరచి పోయావటరా... తెల్లోళ్ల చేతుల్లో పడే గదంటరా...సముద్రంలో పడి చచ్చిపోయింది...

అసలు నువ్వు అడ్డంలేరా...వాణ్ని తన్ని తగలేస్తాను...' సత్తెయ్య గోవిందుని వెనక్కు తోశాడు.

'ఆగు...' అంటూ హుంకరించాడు గోవిందు.

ఇది నా ఇల్లు...నాయిష్టంవచ్చినట్లు చేస్తాను.' అన్నాడు ఆవేశంగా.

'ఇల్లు నీదేరా...గూడెం గూడా నీదేనటరా...సుశీల ఇంట్లో ఉన్నదా...'

'ఉంది...'

'వీడు రావటము దానికి గూడా ఇష్టమేనా... '

'సత్తెయ్యా...?!'

'నీ సంగతి రేపు తేలుస్తా నుండు... ధూ... వెధవ బతుకులు ' సత్తెయ్య తుపుక్కున ఉమ్మేసి వెళ్లిపోయాడు.

గోవిందు తల వంచుకొని లోపలకు వచ్చాడు.

'ఎవరు వచ్చింది...?' జాన్ అడిగాడు.

'ఎవరూ లేరు...' గోవిందు తలపాగ విప్పదీసి దులిపి భుజం మీద వేసుకున్నాడు.

'అంతా వినబడింది... నేను వెళ్ళిపోతానులే గోవిందూ. ప్రాణం మీద తీపి నన్నిలా తెచ్చింది... లేకపోతే వచ్చేవాణ్నే కాదు...'

'మీరు మెదలకుండా పడుకోండి సార్...' గోవిందు విసుక్కున్నాడు.

'గోవిందూ... నా సంగతి విను... విన్న తర్వాతగూడా నే నిక్కడ ఉండవచ్చు అనుకుంటే సరే... లేకపోతే వెళ్లిపోతాను'.

గోవిందు మెదలకుండా చాపమీద కూర్చున్నాడు.

'నువ్వు రిక్షా మానుకో గోవిందూ... ఏదన్నా వ్యాపారంచేసుకుని బ్రతుకు... రిక్షా పనిమట్టుకు వద్దు... రిక్షాపని పెట్టుకున్నా తెల్లవాళ్ళను మటుకు దగ్గరకు రానియ్యద్దు... ఒకసారి మద్రాసులో ఏమయిందో తెలుసా? నీ బోటివాడే తీసుకెళ్ళితే ఒక ఇంటికి పోయాను... రాధ అక్కడఉంది .. బాగా తాగిఉన్నానేమో... నా ఒళ్ళు నాకు తెలియ లేదు... రాధ బ్రతిమలాడింది... తిట్టింది... అభిమానంగల పిల్లని తర్వాత తెలిసింది... నన్ను చూడు... దున్నపోతులాగా ఉన్నాగదూ... రాధ బెదరింపులు ఎందుకూ పనికిరాలేదు .. పశువులాగా ప్రవర్తించాను. ఆ రాధ మద్రాసునుంచీ ఇక్కడకు వచ్చిందని విన్నా... నాకు ఎవరూ లేరని చెప్పానుగా .. చివరకు రాధను నాతోపాటు తీసుకుని పోదామను కున్న తర్వాత రాధ కనబడనే లేదు ఇక్కడ వెతికాం గదూ... నీకు కనబడితే మటుకు చెప్పు .. అయినా ఏం కనబడుతుందిలే .. ఇక్కడకు వచ్చిందని అన్నారుగాని దేంట్లోఅన్నా దూకి చచ్చిపోయి ఉంటుంది .. ప్చ్ .. అంతేలే అంతా నా మాదిరిగా దులపరించుకొని తిరుగుతారూ .. ఏం . గోవిందూ .. వింటున్నావా... ఊఁ .. రాధ కనబడితే చెప్పు ..'

జాన్‌కు ఆయాసం ఎక్కువయింది. ముఖం జేవురించింది. నా కెప్పుడన్నా ఇలా అవుతూ ఉంటుందిలే ..' అన్నాడు.

తుపాకి నేలమీద పడింది.

గోవిందు, సుశీల అన్నంతిని వరండాలో పడుకున్నారు.

'పాపం చాల సుస్తీగా ఉంది ఆయనకు...' అన్నాడు గోవిందు.

'ఊఁ ' అంది సుశీల.

'సత్రెయ్య వచ్చి నానామాటలు అనిపోయాడు...'

'ఉహూ...'

'ఆయనిక్కడ పడుకోవటం నీ కిష్టంలేదా ..'

సుశీల గోవిందువంక తీక్షణంగా చూసింది ..

'రేప్పొద్దునేవెళ్ళి పోతాడుగా ..' అన్నాడు గోవిందు.

'మీ ఇష్టం' అంది సుశీల.

నీకూ ఇష్టం లేదులే నీ మాటల్లోనే తెలుస్తుందిగా...చస్తుంటే 'రామరామ' అంటం గూడా తప్పే...'

'నా కిష్టం లేదని ఎవరన్నారు...?'

'ప్రత్యేకంగా చెప్పాలేమిటి వాలకం తెలియటంలా. పుల్లయ్య కూతురు చచ్చి పోయిందనేగ?...'

'ఆ సంగతులన్ని ఇప్పుడెందుకు ..'

'సరేలే...పడుకో...' గోవిందు రివ్వుమని వెనక్కు తిరిగాడు.

'అడ్డమైన వాళ్ళ కొంపలో ఎందుకు' అని గొణుక్కుంది సుశీల.

జాన్ తెల్లవార్లు కలవరించాడు.

ఒకసారి మటుకు 'రాధా' అంటూ బిగ్గరగా అరిచాడు. సుశీల ఉలిక్కిపడి లేచింది. గోవిందు నిశ్చింతగా నిద్ర పోతున్నాడు. ఒంట

రిగా గదిలోకి పోవటనికి భయం వేసింది. పుల్లయ్య కూతురు దారికి అడ్డంగా నిలబడ్డట్లై తోచింది. గుండె దిటవు చేసుకుని లోపలకు వెళ్లింది.

జాన్ కళ్లు మూసుకుని పలవరిస్తున్నాడు.

'వచ్చావా ..'

'ఏం కావాలి మీకు...' అంది సుశీల.

జాన్ కళ్లు తెరిచాడు. సుశీల వంక కళ్ళుచికిలించి చూశాడు. కళ్ళు మూసుకుని మళ్లీ తెరిచాడు. ముఖం మీద చెమట పట్టి ఉంది. పెదిమలు తడబడు తున్నాయి. ముఖం పక్కకు తిప్పేసుకుని పడుకుని ఏడవటం మొదలు పెట్టాడు జాన్. సుశీల గుండె దడదడ లాడింది. గబగబా బయటకు వచ్చేసి లోపలకు చూసింది. జాన్ తుపాకిని గుండెల దగ్గరకు లాక్కున్నాడు.

గోవిందు మసిలాడు. 'లేచా వెందుకు.' అన్నాడు.

'ఆయన పెద్దగా అరిస్తే చూద్దామని వెళ్లాను.'

'ఊ ' గోవిందు మళ్ళా పడుకున్నాడు.

ఒక రాత్రివేళ గోవిందుకు మెలకువ వచ్చింది. కళ్ళు అంటుకుని పోతున్నాయి. బలవంతాన కళ్ళు తెరిచి పక్కకు చూశాడు. సుశీల అటూ ఇటూ మసలుతోంది. లేచి ఇంట్లోకి వెళ్ళాడు. వెళ్ళిన వెంటనే వెనక్కు పరుగెత్తుకొచ్చాడు.

'ఆయనేడి...?' గోవిందు ముఖం పాలిపోయి తెల్లగా ఉంది.

'లేడా...?' సుశీల అంతకంటె తెల్లబోయింది. గోవిందు సుశీల వంక సూటిగా చూశాడు.

'రాత్రి ఏ మన్న అన్నావా ఆయన్ను...?'

'నాకేం పని అంది సుశీల...'

'నువ్వు ఏదో అని ఉంటావు...ప్రాణం పోయేట్టుగా ఉంటే కాస్త చోటిస్తే తప్పొచ్చిందా...అంత మాత్రం ఓర్పు లేదేం నీకు. ఆయనది మటుకు నీ ప్రాణం లాంటిదిగాదా...అప్పుడు పడవలో నుంచి పడిపోయి నప్పుడు నేను రక్షించక పోతే ఏమయ్యేది నీ ప్రాణం . !'

గోవిందు మండి పడ్డాడు.

'రక్షించ మని నేను కోరలేదు'

గోవిందుకు జుగుప్స కలిగింది! 'ఆ మాట అప్పుడు తెలియాల్సింది నాకు...' అన్నాడు.

'చెప్పలేక పోయాను ..' అంది సుశీల. ఆమె మనస్సులో గతంలోని స్మృతు లెన్నో పైకి వచ్చినాయి. కళ్లలో నీళ్ల నిలిచాయి.

'నీ కేమన్నా మతిపోయిందా...' గోవిందు నిస్తబ్ధుడయ్యాడు.

ఆ క్షణంలోనే కొద్ది దూరం నుంచి తుపాకి పేలిన చప్పుడు, పెద్ద మూలుగు వెంట వెంటనే వినబడ్డాయి. గోవిందు కాళ్ల కింద నేల కదిలి పోతున్నట్లు అనిపించింది.

'ఆ తుపాకే... అతనే ..' అంటూ గోవిందు వీధిలోకి పరుగెత్తాడు.

సుశీల చెయ్యి అడ్డు పెట్టి వారించింది. నిర్ఘాంతపోయి సుశీల వంక చూశాడు. ఆమె తెల్లని పెద్ద పెద్ద కళ్ళ వంక సూటిగా చూడ లేక పోయాడు .. ఆమె సన్నగా పొడుగ్గా ..నల్లగా కనపడింది. అతని మనసు కలవరం పొందింది.

అతాత్తుగా ఆమెను గట్టిగా హృదయానికి హత్తుకొని 'నిజం చెప్పు.. నువ్వు నా సుశీలవే గదూ...' అన్నాడు. సుశీల కళ్ళ వెంబడి నీళ్లు జలజలా రాలినాయి.

'మీకు సుశీలనే...' అంది మెల్లగా.

—o—